క్లుప్తంగా

మాజీ మంత్రి వాసిరెడ్డి జయంతి



దుప్పట్ల పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, కొప్పల వెలమ సంఘ నాయకులు

బొబ్బిలి: భారీ నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖల మాజీ మంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు ఈ ప్రాంత రైతాంగానికి ఎన్నోసేవలందించారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మాజీ మంత్రి వాసిరెడ్డి జయంతి సందర్భంగా కొప్పల వెలమ సంఘ నాయకులు శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ జంక్షన్‌లోని వాసిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొప్పల వెలమ సామాజిక వర్గ సంఘ నాయకులు, కార్యవర్గమంతా కలిసి పేదలకు దుప్పట్ల పంపిణీ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎల్.జగన్నాథ, కె.సి.హెచ్ అప్పలస్వామి, గొట్టాపు కృష్ణమూర్తి, కర్రి సత్యనారాయణ, బలగ సాయికృష్ణ, వాలేటి తవిటి నాయుడు, ఎం.లక్ష్మయ్య,రెడ్డి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ



ఉపాధ్యాయులకు బీరువా అందజేస్తున్న దాతలు

రాజాం: మండలంలోని మొగిలివలస ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన దాతలు రూ.14 వేలు విలువచేసే బీరువాను వితరణ చేశారు. హెచ్ఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామానికి చెందిన బ్యాంకు ఉద్యోగులు ఆవుగు గణనాథ, శాసపు రమణమూర్తి, వార్డు మెంబర్ లెంక వెంకటరమణ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పాగిరి వెంకటరమణ సంయుక్తంగా పాఠశాలకు బీరువా సమకూర్చారని చెప్పారు. దాతలకు హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు కాంతారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విజేత హైస్కూల్ పూర్వ విద్యార్థులు

బొబ్బిలి: స్థానిక విజేత హైస్కూల్‌లో 1999–2000 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని మై ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వవిద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని సందడిగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సత్కరించారు.గొంగాడ రామారావు, వెంకట్నాయుడు, శంకర శాస్త్రి,రమేష్, శ్రీనివాసరావు, సత్యవర ప్రసాద్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు



ఉంగరాడమెట్ట ఆలయంలోపూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: శ్రావణ మాసం, కృష్ణాష్టమి కావడంతో మండలంలోని ఉంగరాడమెట్ట, రేగిడి, అంబఖండి, దేవుదళ తదితర గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి, దుర్గాదేవి, సంతోషిమాత ఆలయాలు భక్తులతో శనివారం కిటకిటలాడాయి. ఆయా ఆలయాల అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేయించారు.

కాలువలో పిచ్చిమొక్కల తొలగింపు



కాలువలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న రైతులు

రేగిడి: ఎవరో వస్తారు... ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రైతులే శనివారం శ్రమదానం చేసి తమ పొలాలకు సాగునీరు అందించే కాలువలో పిచ్చి మొక్కలు, పూడిక తొలగింపు పనులు చేపట్టారు. మద్దువలస ఉపకాలువకు సంబంధించిన 18ఎల్‌ఆఫ్10ఆర్ కెనాల్‌లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పొలాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. దీంతో ఉప్పరనాయుడువలస, చాటాయవలస, వండానపేట గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు శ్రమదానం చేసి కాలువలో పిచ్చి మొక్కలను తొలగించారు. చాటాయవలస, వండానపేట సర్పంచ్‌లు కరణం గోవిందరావు, వియ్యపు చక్రపాణి ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి.

గుక్కెడు నీళ్లివ్వండి సారూ..!

- ప్రభుత్వ పాఠశాలల్లో మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్లు
- నిర్వహణ, మరమ్మతులకు నోచుకోని వైనం
- మధ్యాహ్నభోజన సమయంలో తాగు నీటికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



కొట్టక్కి ఉన్నత పాఠశాలలో పని చేయని వాటర్ ప్లాంటు

రామభద్రపురం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మన బడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా సర్కారు బడుల్లో సకల వసతులు కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దింది. ప్రాథమిక,ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల్లో నాడు–నేడు కింద తొమ్మిది రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది.విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాఠశాల ల్లో మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ లోపించడంతో చాలా వరకు మూలకు చేరాయి. వాటిని బాగుచేయించక పోవడంతో విద్యార్థులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు.ఇళ్ల నుంచి బాటిళ్లతో వెంట తెచ్చుకుంటున్న నీరు మధ్యాహ్న భోజనం సమయానికి అయిపోతోంది. భోజన సమయంలో గొంతుపడి నీటి కోసం అల్లాడుతున్నారు. గత్యంతరం లేక బోర్ల నీటిని, చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకునే కుళాయిల నీటినే తాగాల్సి వస్తోంది. అసలే వర్షాకాలం కావడం, ఆనీరు తాగితే రోగాల బారిన పడతామని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో తాగాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు.



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో టాంకు నుంచి డైరెక్ట్‌గా ట్యాపుల ద్వారా వచ్చే నీటిని తాగుతున్న విద్యార్థులు

చేతులెత్తేసిన హెచ్‌ఎంలు

గత ప్రభుత్వంలో మండలంలోని సుమారు 46 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు.ఎక్కువ సంఖ్య ఉన్న పాఠశాలల్లో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలతో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయగా, విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న పాఠశాలల్లో రూ.30 వేల నుంచి రూ.70 వేలతో చిన్న మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి నిర్వహణను విస్మరించడంతో 90 శాతానికి పైగా పనిచేయడం లేదు.వీటికి అయ్యే ఖర్చును పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ సొంత నిధుల నుంచి భరించలేక చేతులెత్తేశారు. వర్షాకాలం కావడం బోర్ల నుంచి డైరెక్ట్‌గా వచ్చే నీరు తాగడం వల్ల విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదముందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం..



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదని మా దృష్టికి వచ్చింది. వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసిన కంపెనీ ప్రతినిధుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినా స్పందన రాలేదు. మరమ్మతులు చేపట్టాల్సిన వాటి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే మరమ్మతులు చేయించి శుద్ధ జలం అందుబాటులోకి తెస్తాం.

– ఏ.తిరుమలప్రసాద్, ఎంఈఓ, రామభద్రపురం మండలం

పిల్లల ఇబ్బందులు కనిపించడం లేదా..?



ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు పడుతున్న ఇబ్బందులు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదా..? పాఠశాలలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. సగం కంటే ఎక్కువ ప్రభుత్వ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు పని చేయకపోవడంతో పిల్లలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం లేదు.ఇదంతా గమనించే తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు పాఠశాల్లో చేర్పిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేయించి విద్యార్థులకు శుద్ధజలం అందించాలి.

– కె.విజయగౌరి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పోయింది



ప్రజలకు కూటమి హామీలను గుర్తు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

- వర్షంలోనూ 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'కి ఆదరణ

బొబ్బిలి: టీడీపీ కూటమి ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం ఎప్పుడో పోయిందని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని 31వ వార్డులో శనివారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శంబంగి వార్డులోని ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అండ్‌కో ఎన్నికల హామీలు, వాటిని అమలు చేయకుండా చేస్తున్న మోసాలను వివరించారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నప్పుడు వర్షం పడుతున్నా లెక్క చేయకుండా ప్రజలంతా ఆదరించారు. ప్రభుత్వ వ్యతిరేకతతో ఇలా స్వయంగా ప్రజలే ముందుకు వస్తున్నారని శంబంగి అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు అండ్‌కో ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీలను గుర్తు చేశారు. వీటిలో ఏవైనా అమలయ్యాయా అని ప్రజలను ప్రశ్నించారు. మహిళలు స్పందిస్తూ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయినా ఏ పథకం పూర్తిస్థాయిలో అమలు కావడంలేదన్నారు. హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని తిరస్కరించాలనిప్రజలకు శంబంగి పిలుపునిచ్చారు. హామీలను అమలు చేయకపోగా రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోం దన్నారు.అన్యాయం, ఆక్రమణలు, దోపిడీ, బెదిరింపులు చోటు చేసుకుంటున్నా యన్నారు. వీటిని ప్రజలంతా నిలదీసే రోజులువస్తున్నాయన్నారు.మున్సిపల్ మాజీ చైర్మన్‌లు ఇంటి గోపాలరావు, ఎస్.వి. మురళీకృష్ణారావు, వార్డు కౌన్సిలర్ చోడిగంజి అనసూయమ్మ, కార్య కర్తలు, నాయకులు, పలు వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

రైతన్నకు ఎరువు కష్టాలు

- నగమే వచ్చిన ఎరువు
- రైతు సేవా కేంద్రాల్లో అరకొరగా పంపిణీ
- అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రైవేటు దుకాణాల నిర్వాహకులు

రాజాం: నియోజకవర్గంలో రైతులకు ఎరువు కష్టాలు తప్పడంలేదు. అటు ప్రతికూల వాతావరణం, ఇటు ప్రతికూల ప్రభుత్వ విధానాలతో సతమతమవుతున్నారు. ప్రస్తుతం అన్నిచోట్లా వరినాట్లు జరుగుతున్నాయి. ముందుగా నాట్లు వేసిన చోట ప్రతికూల వాతావరణం కారణంగా నాట్లు రంగు మారి చనిపోయే పరిస్థితి వచ్చింది. ఈసమయంలో పంటలకు యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు వేయాల్సి ఉంది. ముందస్తుగా నవధాన్యాల విత్తనాలు పంపిణీ, పచ్చిరొట్ట ఎరువు అందజేయడంవంటివి చేయకపోవడంతో రైతు పూర్తిగా రసాయన ఎరువులపై ఆధారపడ్డాడు. రైతు సేవా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో ఎరువులు లభించకపోవడం , ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలు చెల్లించలేక సతమతమతున్నాడు.

ఇష్టారాజ్యంగా దోపిడీ..

ఎరువుల కొరతను ప్రైవేటు ఫెర్టిలైజర్స్ వ్యాపారులు సొమ్ముచేసుకునేందుకు చూస్తున్నారు. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అదనపు డబ్బులు పిండేస్తున్నారు. రూ. 280కు విక్రయించాల్సిన యూరియా బస్తాను రూ. 350 చొప్పున అమ్ముతున్నారు. వీటికి అవసరం లేని గుళికలు అంటకట్టి అదనంగా ఒక్కో యూరియా బస్తా వద్ద రూ. 400 వసూళ్లు చేస్తున్నారు.

నగం కూడా జరగని యూరియా పంపిణీ

రాజాం నియోజకవర్గంలో గతంలో ప్రతీ ఏడాది ఖరీఫ్‌సాగు 25,442 హెక్టార్లు కంటే అదనంగా ఉండేది. ఈఏడాది ప్రతికూల పరిస్థితి కారణంగా సాగు తగ్గుముఖంపట్టింది. ఇప్పటివరకూ 14,150 హెక్టార్లలో వరి నాట్లు పడినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీటికి 6,500 టన్నుల యూరియా, 3 వేల టన్నుల డీఏపీ తొలివిడతలో ఉండాలి. ఇంతవరకు రైతు సేవా కేంద్రాలకు, ప్రైవేటు డీలర్లకు 3250 టన్నుల యూరియా, డీఏపీ 450 టన్నులు మాత్రమే వచ్చాయి. వీటితో రైతులు తీవ్ర ఎరువు కొరతను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో ఒక్కరైతు సేవా కేంద్రంలో కూడా పొటాష్ పంపిణీ కాలేదు. ప్రైవేట్ డీలర్లు వద్ద అరకొరగా పొటాష్ ఉంది. ఫలితంగా సాగుచేసే అన్నదాతకు ఎరువు కష్టాలు అధికమయ్యాయి.



రాజాంలోని ఓ ఎరువుల దుకాణం వద్ద రైతుల రద్దీ

ఇబ్బందులు పడుతున్నాం

ఈ ఏడాది యూరియా కొరత చాలా ఎక్కువగా ఉంది. రాజాంలో ప్రైవేటు డీలర్లు వద్ద కూడా ఎరువు లభించడంలేదు. సిఫార్సులు చేసినవారికే ఎరువులు ఇస్తున్నారు. యూరియా కొంటే గుళికలు కొనాలని లింకు పెడుతున్నారు. అవి కొనుగోలుచేసినా ఎరువు దొరకడం లేదు.

– తాడ్డి సూరిబాబు,రైతు, లక్ష్మీపురం, రాజాం మండలం.

క్యూలో నిల్చున్నా దొరకడం లేదు

ఎరువులు కోసం చాలా తంటాలు పడుతున్నాం. క్యూలో నిల్చున్నా ఎరువులు దొరకడంలేదు. రైతు సేవా కేంద్రానికి ఒక్కదఫా వచ్చాయి. మూడు ఎకరాలకు ఒక బస్తా మాత్రమే ఇచ్చారు. ఎలా పంటలు సాగుచేయాలి.

– చాపల సోమేశ్వరరావు, రైతు, కాకరాపల్లి

చర్యలు తీసుకుంటున్నాం

యూరియా ఎరువు కొరత కాస్త ఉంది. త్వరలో కొరత లేకుండా కావాల్సినంత యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని రైతు సేవాకేంద్రాల్లో ఒక్కో లోడు ఎరువు పంపిణీ జరిగింది. చాలని ప్రాంతాలకు మళ్లీ ఇస్తాం.

– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



అవగాహనకల్పిస్తున్న సీఐ నారాయణరావు

బాడంగి: రోజు రోజుకీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన కల్పించుకుని, అప్రమత్తం గా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు అన్నారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలపై మండలంలోని రామచంద్రాపురం గ్రామస్తులకు శనివారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, వినియోగించినా నేరమేనని అన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, వినియోగించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత మత్తు పదార్థాల జోలికిపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డులు, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు.ఫోన్ లేదా మెయిల్స్‌కు వచ్చే వెబ్‌సైట్ లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని చెప్పారు. ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని, వినాయకచవితి పండగ వస్తున్నందున గ్రామంలో తగాదాలు లేకుండా ఉత్సవ కమిటీలను నియమించుకుని శాంతియుతంగా ఉత్సవాలు చేసుకోవాలన్నారు. గ్రామంలోని కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.ఎస్ఐ తారకేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అమ్మడమ్మకు నివాళి



అమ్మడమ్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలిరూరల్: మాజీ ఎంపీపీ తమ్మిరెడ్డి అమ్మడమ్మ(75) మండలంలోని చింతాడ గ్రామంలోని తన నివాసంలో శుక్రవారం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం సందర్శించి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. అమ్మడమ్మ కుటుంబ సభ్యులు మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోదరరావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

• ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



రాజాం: పాగిరిలో చిన్నికృష్ణుని వేషాధారణలో చిన్నారి



రాజాం : లక్ష్మీపురంలో గోపికవేషాధారణలో ఓ చిన్నారి

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని వాడవాడలా శనివారం ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి, శ్రీకృష్ణుని ఆలయాల్లో, ఇళ్లలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో సందడి చేశారు. సాయంత్రం వీధుల్లో యువత ఉట్టి కొట్టే సంబరాలు నిర్వహించారు. పలుగ్రామాల్లో ఆలయాల వద్ద అన్నదానం చేశారు.

– సాక్షి నెట్ వర్క్



రాజాం సిటీ: పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



బొబ్బిలిరూరల్: కృష్ణాపురంలో గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



తెర్లాం: తెర్లాం అంగన్‌వాడీ కేంద్రం-5లో కృష్ణాష్టమి వేడుకలు



సంతకవిటి:వాసుదేవపట్నంలోని ఆలయంలో చిన్ని కృష్ణుడిని ఊయలలో వేస్తున్న దృశ్యం



బాడంగిలో కృష్ణుని విగ్రహం ఊరేగింపులో చిన్నారుల కోలాటం



వంగర: మద్దివలసలో శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



రేగిడి: అంబకండి అంగన్‌వాడీ కేంద్రంలో కృష్ణుడి వేషధారణలో సందడి చేస్తున్న చిన్నారి



రామభద్రపురం: రామభద్రపురంలో గోపిక వేషధారణలో చిన్నారి



రామభద్రపురం: రామభద్రపురంలోని గ్లోబల్ వ్యూ స్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారి

జీవామృతం తయారీపై అవగాహన

రేగిడి: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మండలంలోని వన్నలి గ్రామంలో రైతులకు జీవామృతం తయారీపై ప్రకృతివ్యవసాయ సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయం ఎల్–2లు గౌరీశ్వరరావు, సురేష్ మాట్లాడుతూ వరిపంట తెగుళ్లబారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉండేందు కు జీవామృతం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కిలో బెల్లం, కిలో శనగపిండి, పదిలీటర్ల గోమూత్రం, తదితర వస్తు సామగ్రిని ఒక టబ్బులో వేసి మూడు రోజుల పాటు మురగబెడితే జీవామృతం తయారవుతుందని వివరించారు. ఈ ద్రావణాన్ని ఎకరానికి ఏడు ట్యాంకులు పిచికారీ చేయడం ద్వారా వరి దుబ్బులు, పిలకల సంఖ్య పెరుగుతుందని, డీఏపీ, యూరియా వినియోగాన్ని పూర్తిగా తగ్గించవచ్చని తెలిపారు. ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ పాల్గొన్నారు.

పరామర్శ



రాజాం: ఆదెమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ రాజేష్, తదితరులు

రాజాం: మండలంలో బొద్దాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నక్క రాజు తల్లి, సర్పంచ్ నక్క శ్రీనివాసరావు నాన్నమ్మ ఆదెమ్మ ఇటీవల మృతిచెందారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, నాయకులు శనివారం బొద్దాం గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో రాజాం రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, సర్పంచ్‌ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, పార్టీ బీసీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ నరేంద్ర, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నక్క సత్యారావు, మాజీ డైరెక్టర్ నక్క ఉమా మహేశ్వరరావు, వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు, నాయకులు నక్క ప్రసాద్ ముళ్ల గోవింద, బట్న మల్లిబాబు, కింజ రాపు తిరుపతి, జైభీమ్ జిల్లా అధ్యక్షుడు గండి పైడిరాజు, అలజంగి లక్ష్మణరావు తదితరులున్నారు.

బలరాంనాయుడు కుటుంబానికి..



రేగిడి: బలరాంనాయుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన టంకాల బలరాంనాయుడు ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. బలరాం నాయుడు మృతికి కారణాలను కుమారుడు జితేంద్రను అడిగితెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, సర్పంచ్‌లు లెంక రాంబాబు, కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, టంకాల ఉదయానందకుమార్, టంకాల సతీష్, పాలవలస అప్పలనాయుడు తదితరులున్నారు.